క్లుప్తంగా

పాన్‌గల్ ఎంపీడీఓగా గోవిందరావు



పాన్‌గల్: మండల నూతన ఎంపీడీఓగా గోవిందరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కోటేశ్వర్ సాధారణ బదిలీలో భాగంగా నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నారాయణపేట జిల్లాలో విధులు నిర్వర్తిస్తున్న గోవింద్‌రావును పాన్‌గల్ మండలానికి కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సిబ్బంది సహకారంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. నూతనంగా వచ్చిన ఎంపీడీఓను కార్యాలయం సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని శ్రీనివాసపురానికి చెందిన బాలకృష్ణకు బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. బాలకృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ కోసం దరఖాస్తు చేసుకోగా.. ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పందించి సీఎంఆర్‌ఎఫ్ చెక్కును మంజూరయ్యేందుకు కృషి చేశారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో లక్కాకుల సతీష్, చీర్ల చందర్, కౌన్సిలర్ వెంకటేష్, మాజీ కౌన్సిలర్ కృష్ణబాబు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ డి.వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో అంకితభావంతో పనిచేయాలి



వనపర్తిటౌన్: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించిన సుధీర్‌ను బుధవారం మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి శాలువాతో ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ నాగన్న కుమారుడు సుధీర్ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ)లో ఉద్యోగం సాధించడం అభినందనీయమన్నారు. పట్టుదలతో పని చేసి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకటి శ్రీధర్, నాయకులు రహీం, నాగేంద్రం, కవిత, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



మదనాపురం: తల్లిపాల వారోత్సవాలను గ్రామాల్లో పకడ్బందీగా నిర్వహించాలని, తల్లి పాల విశిష్టత గురించి గర్భిణులు, బాలింతలకు తెలియజేయాలని డాక్టర్ భవాని సూచించారు. బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్‌ఎంలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో బరువు తక్కువ ఉన్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కిశోర బాలికలు తీసుకోవాల్సిన ఆహారం నియమాలను వివరించాలన్నారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన హెల్త్ సూపర్‌వైజర్ రాణిని పూలమాల, శాలువాతో సన్మానించారు.

హామీల అమలులో విఫలం



ఖిల్లాఘనపురం: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ప్రశ్నిస్తే అరెస్టు చేస్తారా అని బీజేపీ మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు గుంపలి ఈదమ్మ ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, చేతులెత్తేసిందని దుయ్యబట్టారు. ఈ మేరకు అసెంబ్లీ ముట్టడికి రాష్ట్ర మహిళా మోర్చా బుధవారం పిలుపునివ్వగా.. పోలీసులు ఈదమ్మ, బుచ్చిబాబుగౌడ్‌ను బుధవారం ఉదయం తెల్లవారుజామున అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

వసతులు కల్పించాలి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు శేఖర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో ఉన్న సమస్యలను విద్యార్థులను అడిగి ఆయన తెలుసుకున్నారు. ఇప్పటి వరకు విద్యార్థులకు నోటుబుక్స్, బెడ్‌షీట్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో సాయి, దేవేందర్, నితిన్ పాల్గొన్నారు.

పొదుపు.. మహిళలకు ధీమా



జమ్మాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న సీసీ నాగరాజు

- మహిళా సంఘాల సభ్యులకు బీమా సౌకర్యం
- సభ్యుల కుటుంబాలకు ఎంతో ప్రయోజనం
- మండలంలో 7 వేలకు పైగా సభ్యులు



పాన్‌గల్ ఐకేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ ఉమాదేవి (ఫైల్)

పాన్‌గల్: అతివల ఆర్థికాస్వావలంబనకు స్వయం సహాయక సంఘాల పటిష్టత సరైన మార్గం. ఈ దిశగా రాష్ట్ర ప్రభుత్వం కొత్త పథకాలు అమలు చేస్తోంది. రుణాలు పొందిన సంఘాల మహిళలకు బీమాతో దీమా కల్పిస్తోంది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంబంధిత ప్రక్రియ చేపట్టింది. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకం ద్వారా రూ. 5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నారు. రుణ వాయిదాలను ప్రతి నెలా క్రమం తప్పకుండా లోను ఖాతాకు చెల్లిస్తున్నారు. దీనికి తోడు నిర్ణీత మొత్తాన్ని పొదుపుగా జమ చేస్తున్నారు. ఈ క్రమంలో ఎవరైనా సభ్యురాలు దురదృష్టవశాత్తు మృతి చెందితే వారి కుటుంబంపై రుణభారం పడుతోంది. ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని గమనించిన ప్రభుత్వం సంఘాల సభ్యులకు బీమా పథకం వర్తింపజేయాలని, బాధిత కుటుంబాలను కష్టాల్లోంచి గట్టెక్కించాలని ఇటీవల నిర్ణయం తీసుకుంది.

కొత్తగా.. రెండు పథకాలు

18 నుంచి 60 ఏళ్ల వయసున్న సభ్యులకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ మూడు రకాల బీమా పథకాలను అమలు చేస్తోంది. ఆధార్ వివరాల ఆధారంగా ప్రస్తుతం సభ్యుల వయసు నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. అర్హులైన వారికి రూ.2 లక్షల రుణ బీమా వర్తిస్తుంది. ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లిస్తోంది. ఏదైనా కారణంతో మృతిచెందితే మిగతా వాయిదాలు మాఫీ అవుతాయి. మరో పథకం ప్రమాద బీమా దీని ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. ఎవరైనా సభ్యులు ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.10 లక్షల పరిహారం మంజూరవుతుంది. ఇందుకు కావాల్సిన ధృవపత్రాలు సమర్పించాలి. ఈ రెండు పథకాలు ఈ ఏడాది మార్చి 14 నుంచి వర్తింపజేస్తున్నారు. మూడో పథకం.. స్త్రీ నిధి సురక్ష ఇది ఇప్పటికే అమలులో ఉంది. సభ్యురాలు ఏడాదికి రూ.230 ప్రీమియం చెల్లించాలి. మూడేళ్లకు ఒకే విడతగా చెల్లించే అవకాశం ఉంది. రుణం పొందిన సభ్యులెవరైనా ఏ కారణంతో మృతిచెందినా రూ.2 లక్షల పరిహారం మంజూరవుతుంది. బ్యాంకు లింకేజీ కాకుండా స్త్రీనిధి పథకం కింద అప్పటి వరకు చెల్లించిన వాయిదాలను తిరిగి ఇచ్చేస్తారు. బకాయిలు మాఫీ అవుతాయి. మృతిచెందిన సభ్యుల వివరాలను పోర్టల్‌లో నమోదు చేసిన 15 రోజుల్లో పరిహారం మంజూరవుతుంది.

మండలంలో ఇలా..

మండలం	వీఓఏలు	సంఘాలు	సభ్యులు
పాన్‌గల్	35	671	7233
చిన్నంబావి	19	411	4045
వీపనగండ్ల	19	441	4567

బీమా పథకాలపై..

మహిళా సంఘాల సభ్యులకు ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న బీమా పథకాలపై గ్రామాల్లో సంఘం సభ్యులకు అవగాహన కలిస్తున్నాం. సంఘంలో సభ్యులుగా ఉండి ప్రమాదవశాత్తు మృతి చెందితే లభించే పరిహారం, తదితర అంశాల గురించి సమావేశాల్లో వివరిస్తున్నాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాలు మహిళా సంఘాల సభ్యులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. – ఇందిర, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు, చిన్నంబావి

బీమా వర్తిస్తుంది



సంఘంలో సభ్యులైతే ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన బీమా పథకాలు వర్తిస్తాయనే విషయం గ్రామాల్లో మహిళలకు వివరిస్తున్నాం. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి సభ్యులకు బీమా వర్తింపజేయడం హర్షించదగిన విషయం. మహిళ సంఘాల సభ్యుల కుటుంబాలకు ఈ పథకాలతో ప్రయోజనం చేకూరుతుంది. – సుజాత, సంఘం సభ్యురాలు, బహుదూర్‌గూడెం

సభ్యులకు ప్రయోజనం

మహిళ సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రెండు రకాల బీమా సౌకర్యం కల్పించడం వల్ల వారి కుటుంబాలకు, రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. దీనిపై సంఘం సభ్యులకు అవగాహన కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నాం. – ఉమాదేవి, డీఆర్‌డీఓ, వనపర్తి

రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ఎజెండా



సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రైతులు, నాయకులు

పాన్‌గల్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రుణమాఫీ చేస్తుండడంతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని శాగాపూర్‌తండాలో రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రూ.2 లక్షల రుణమాఫీని మూడు విడతల్లో చేస్తామని ప్రకటించారని, అందులో భాగంగా ఇప్పటికే మొదటి విడత పూర్తై.. రెండో విడత నిధులు రైతుల ఖాతాల్లో జమ చేయడం హర్షించదగిన విషయం అన్నారు. గత ప్రభుత్వం రైతుల రుణమాఫీని విడతల వారీగా చేయడంతో భారంగా మారిందని, అలా కాకుండా ఏకకాలంలో మాఫీ చేసి రైతుల కష్టాలను తీర్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు రుణపడి ఉంటారన్నారు. కార్యక్రమంలో నాగేష్‌నాయక్, గిరిజన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

వీఓఏల సంక్షేమానికి కృషి

పాన్‌గల్: గ్రామ సంఘాల్లో పనిచేస్తున్న వీఓఏల మండల సంఘం నూతన కమిటీని బుధవారం మండల కేంద్రంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా కోశాధికారి దేవేంద్రం ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శేషయ్య, మండల అధ్యక్షుడిగా బాలరాజుయాదవ్, ఉపాధ్యక్షులుగా రాజయ్యగౌడ్, కార్యదర్శిగా ముంత బాలరాజు, కోశాధికారిగా అనిత, సహాయ కార్యదర్శిగా భాగ్యమ్మ, సోషల్ మీడియా కన్వీనర్‌గా నరేష్‌కుమార్ నియమించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు జిల్లా నాయకుల చేతుల మీదుగా నియామక పత్రాలను అందుకున్నారు. వీఓఏల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

న్యాస్ పరీక్షపై ఉపాధ్యాయులకు అవగాహన



పాన్‌గల్‌లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీ

పాన్‌గల్: జాతీయ స్థాయిలో నవంబర్‌లో నిర్వహించే న్యాస్ పరీక్షపై ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు, పాన్‌గల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం నరేందర్ ఉపాధ్యాయులకు న్యాస్ పరీక్షలపై విద్యార్థులను ఏవిధంగా సిద్ధం చేయాలనే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్పీలు రాందాస్, నరసింహారావు, బక్షీరాం, బాలరాజు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు మండలంలోని ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులు 50 శాతం మొదటి రోజు, మిగతా 50 శాతం రెండోరోజు హాజరవుతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఆర్పీలు గోవింద్, రమాదేవి, భార్గవి, ఎంఐఎస్ కోఆర్డినేటర్ శేఖర్‌నాయక్, కంప్యూటర్ ఆపరేటర్ మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించే న్యాస్ పరీక్షలో జిల్లాను అగ్రగామిగా నిలపాలని ఎంఈఓ జయరాములు ఉపాధ్యాయులకు సూచించారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన న్యాస్ పరీక్ష శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. పెబ్బేరు, శ్రీరంగాపురం మండలంలోని 50 శాతం మంది ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విషయాల మీద రిసోర్స్ పర్సన్‌తో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మిగతా 50 శాతం ఉపాధ్యాయులు గురువారం పాల్గొనాలని ఎంఈఓ సూచించారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి విష్ణువర్ధన్‌రావు, హెచ్‌ఎం నరసింహారావు, రిసోర్స్ పర్సన్లు శివశంకర్‌యాదవ్, వసంతపురం రాజు, రవి, రాఘవేంద్రసాగర్, చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతే ముఖ్యం

వీపనగండ్ల: గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రాధాన్యతనిచ్చి అందుకు అనుగుణంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులు నిర్ణయించారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో పలువురు పాల్గొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తాగునీరు కలుషితం కాకుండా చూడాలని, అందుకు గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్‌ఎంలు, పంచాయతీ వర్కర్లు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేష్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్లు సుగుణాబాయి, కమల, ఏఎన్‌ఎంలు రామచంద్రమ్మ పలువురు పంచాయతీ వర్కర్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ల అప్పగింత



అమరచింత: అపహరణకు గురైన రెండు సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టర్ ద్వారా గుర్తించి బాధితులకు బుధవారం సెల్‌ఫోన్లను అప్పగించినట్లు ఎస్‌ఐ సురేష్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన శిరీష, మరెడి వాణి సెల్‌ఫోన్లు మిస్సయ్యాయని వారం రోజుల కిందట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు సీఈఐఆర్ పోర్టర్ సహకారంతో సెల్‌ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు.

అక్రమ అరెస్టులు సరికావు

అమరచింత: అక్రమ అరెస్టులతో ప్రజా ఉద్యమాలు ఆపలేరని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌ను బుధవారం స్థానిక పోలీసులు అరెస్టు చేసి సొంత పూచీకత్తుపై వదిలిపెట్టారు. ఈమేరకు వెంకటేష్ మాట్లాడుతూ విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించడంతో పాటు ఇతర సమస్యలను పరిష్కరించాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేయడంతో ప్రభుత్వం నాయకులను అరెస్టులు చేయడం తగదన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, సమస్యల పరిష్కారం కోసం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో రాజీ లేని పోరాటాలు చేస్తామన్నారు.

ఉద్దంసింగ్ చమర్‌కు నివాళి



వనపర్తి టౌన్: భారత స్వాతంత్ర సమరయోధుల్లో భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్‌లతో పాటు ఉరి తీయబడిన గొప్ప పోరాట యోధుడు ఉద్దంసింగ్ చమర్ అని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. సర్దార్ ఉద్దంసింగ్ చమర్ వర్ధంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహాశర్మ, బాలేమియా, బాలస్వామి నాయుడు, బండలయ్య, విజయ్‌కుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

భీమా కాల్వలో షిల్ట్ తొలగించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకులు

పాన్‌గల్: భీమా కాల్వలో పేరుకుపోయిన పూడిక, జమ్మును తొలగించి చివరి ఆయకట్టు వరకు సాగు నీటిని సరఫరా చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా నాయకులు శ్రీరామ్, సీపీఐ జిల్లా నాయకురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. మండలంలోని కేతేపల్లిలో భీమా కాల్వలో పూడిక తొలగించాలని, చివరి ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేయాలని కోరుతూ రైతులతో కలిసి బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాన్‌గల్ మండలంతో పాటు వీపనగండ్ల మండలాల్లో భీమా కాల్వ నీరు సక్రమంగా రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాల్వలో జమ్ము, మట్టి పేరుకపోవడంతో బుసిరెడ్డిపల్లి శివారులోని బొల్లిగట్టు వరకు మాత్రమే సాగునీరు సరఫరా అవుతూ.. కేతేపల్లి వైపు సాగునీరు ముందుకు రావట్లేదని వాపోయారు. కేతేపల్లి మీదుగా ఉన్న భీమా కాల్వ నీరు మండలంతో పాటు వీపనగండ్ల మండలానికి కూడా సరఫరా అవుతాయన్నారు. కాల్వలో పేరుకపోయిన జమ్ము, మట్టిని తొలగించేందుకు మంత్రి జూపల్లి ప్రత్యేక చొరవ తీసుకొని రైతుల ఇబ్బందులు తొలగించాలన్నారు. సమస్యను పరిష్కారించకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పెంటయ్య, చిన్నకుర్మయ్య, పరశురాముడు, కుర్వరాముడు, పెద్దలక్ష్మన్న, ఎర్ర బాలస్వామి, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

రైతులతో బ్యాంకులు కిటకిట

పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ, ప్రాథమిక వ్యవసాయ సహకార సంస్థలో బుధవారం రైతులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో బ్యాంకుల పరిసరాలు రైతులతో కిక్కిరిసిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడంతో మొదటి విడతలో రుణం మాఫీ అయిన రైతులు తిరిగి డబ్బులు తీసుకునేందుకు, రెండో విడత రైతులు లిస్టులో తమ పేరు ఉందా లేదా అనే విషయాలు తెలుసుకునేందుకు బారులు తీరారు.



అటెన్షన్ ప్లీజ్



సూచిక బోర్డు పెట్టాల్సిన ప్రాంతం

పొంచి ఉన్న ప్రమాదం

మదనాపురం మండలంలోని కొన్నూరు సమీపంలో ప్రధాన రోడ్డు మలుపుగా ఉంది. ఈ రోడ్డు గుండా నెల్విడి, ద్వారకనగరం, పెద్దతండా, మదనాపురం, జంగమాయపల్లి, కనిమెట్ట, దుప్పల్లి గ్రామాల ప్రజలు నిత్యం ప్రయాణం సాగిస్తుంటారు. ఈ రోడ్డుపై కొత్తగా ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు రాత్రి వేళల్లో మలుపును గుర్తించక కింద పడి గాయాలపాలైన ఘటనలు చోటుచేసుకున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డుతో పాటు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – మదనాపురం

ఇంకుడుగుంతలతో భూగర్భజలాల పెంపు



మాట్లాడుతున్న ఎంపీఓ పుష్ప

కొత్తకోట రూరల్: గ్రామంలో ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంతలు నిర్మించుకోవడం ద్వారా వృథాగా పోయే నీరు అందులో చేరి భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందని ఎంపీఓ పుష్ప, పంచాయతీ కార్యదర్శి జయమ్మ అవగాహన కల్పించారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీఓ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిరంతరం చేపట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో తాగునీటి సమస్య, దోమలు, ఈగల బెడద ఎక్కువగా ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. డ్రై డే కార్యక్రమం చేపట్టడంలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను వేగంగా పరిష్కరించి, ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరారు. కార్యక్రమంలో ఏఈఓ మధుమోహన్, కాంగ్రెస్ నాయకులు శ్రీశైలం, రఘుగౌడ్, భీంరెడ్డి, కృష్ణ, ఆనంద్, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ తప్పనిసరి



సూగూరు పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న సహచరులు, నాయకులు

పెబ్బేరు రూరల్: ప్రతి ఉద్యోగికి పదవి విరమణ తప్పనిసరి అని మహబూబ్‌నగర్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి అన్నారు. మండలంలోని సూగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి బుధవారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా హెచ్‌ఎం వెంకటరమణ శర్మ అధ్యక్షతన సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి ఆదర్శాలను తీసుకొని విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని సూచించారు. పదవీ విరమణ తర్వాత సమాజ సేవలో పాల్గొంటూ ప్రజాసేవ చేయాలని కోరారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు కలిసి వెంకట్‌రెడ్డి తేజావతి దంపతులను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆవుల శైలజ, మాజీ సర్పంచ్ వెంకటస్వామి, రాజశేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'రైతుబీమా' దరఖాస్తులు నేరుగా అందించాలి



పాన్‌గల్ రైతువేదికలో దరఖాస్తులు అందజేస్తున్న రైతులు

పాన్‌గల్: నూతన పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ నెల 5 లోపు నేరుగా రైతు వేదిక వద్దకు నేరుగా వచ్చి రైతుబీమా దరఖాస్తును అధికారులకు అందించాలని ఏఓ సాజిద్‌రహమాన్ బుధవారం తెలిపారు. చాలా మంది రైతులు తమ దరఖాస్తులను ఇతరులచే పంపిస్తున్నారని, వాటిని తిరస్కరిస్తామని తెలిపారు. లబ్ధిదారుల ఫొటోను క్యాప్చర్ చేయాల్సిన అవసరం ఉండడంతో ఏ క్లస్టర్ పరిధిలోని రైతులు అదే క్లస్టర్ రైతువేదికలో ఏఈఓలు అందించాలని కోరారు. మండల కేంద్రంలోని రైతువేదికలో దరఖాస్తులు అందజేసేందుకు బుధవారం పెద్ద సంఖ్యలో రైతులు చేరుకున్నారు. దరఖాస్తులతో పాటు రెండో విడతలో రుణమాఫీ కానీ రైతులు కూడా మాఫీ కోసం దరఖాస్తులు అందజేస్తున్నారు.

నిధులు ఉన్నా.. నిర్మాణంలో జాప్యమెందుకు?



బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

వనపర్తి టౌన్: రేకులతో ఉన్న నాగవరంలోని బీసీ వసతి గృహంలోని విద్యార్థులు వర్షాల కారణంగా ఇబ్బందులు పడుతున్నారని, స్థలం, బడ్జెట్ ఉన్నా ఎందుకు హాస్టల్ నిర్మాణం చేస్తలేరని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సుబ్బారెడ్డికి ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆది మాట్లాడుతూ.. పెద్దమందడి హాస్టల్‌కు నూతన భవనం నిర్మాణం చేయాలని, జిల్లా కేంద్రంలోని బాలికల జూనియర్ కళాశాల వసతి గృహంలోకి విద్యార్థులను తరలించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా వసతి గృహాలలో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేక బయటికి వెళ్లాల్సి వస్తుందని, గదుల్లో ఫ్యాన్లు లేక దోమల బెడదతో రాత్రిళ్లు విద్యార్థులు జాగారం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి సరిగ్గా నిద్ర లేకపోతే ఉదయం పాఠశాలలు, కళాశాలల్లో ఏం చదువుతారన్నారు. హాస్టల్ వార్డెన్లు సమయపాలన పాటించాలని, మెనూ ప్రకారమే వండి వడ్డించాలని కోరారు. తక్షణమే హస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని, లేకపోతే విద్యార్థులతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్, వీరన్ననాయక్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఖబ్రస్తాన్ పరిశీలన



ఖబ్రస్తాన్‌ను పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సిరాజ్‌పాషా

ఆత్మకూర్: పట్టణంలోని ముస్లింల ఖబ్రస్తాన్ (శ్మశానవాటిక)లో సమాధులు ధ్వంసం చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ముస్లిం సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సిరాజ్‌పాషా బృందం ఖబ్రస్తాన్‌ను సందర్శించి ధ్వంసమైన సమాధులను పరిశీలించారు. ఘటన జరిగి పక్షం రోజులు అవుతున్నా పోలీసులు, అధికారులు విచారణ చేపట్టడం లేదని స్థానిక ముస్లింలు వారి దృష్టికి తీసుకెళ్లారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ సిరాజ్‌పాషా స్థానికులతో కలిసి తహసీల్దార్ రాజు, ఎస్‌ఐ నరేందర్‌తో కేసు పురోగతిని తెలుసుకున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గయాసుద్దీన్, షాహీద్, ఇమ్రాన్, వాహేద్, ఉస్మాన్, నిరంజన్, ఫిరోజ్, యువకులు ఉన్నారు.

ముందస్తు అరెస్ట్



అరెస్టయిన నాయకులతో పోలీసులు

కొత్తకోట రూరల్: కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని చేపట్టగా.. కొత్తకోట నుంచి హమాలీ, ఆటో డ్రైవర్స్ యూనియన్ కార్మికులు హైదరాబాద్‌కు బయలుదేరుతుండగా తెలుసుకున్న కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి కార్మికులకు ముందస్తు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా పోలీసులచే ముందస్తు అరెస్టు చేయించడం ఏంటని ప్రశ్నించారు. కార్మికులకు పోరాటాలు కొత్తవి కావని, అరెస్టులతో తమ పోరాటాలను ఆపలేరని, పోరాడి తమ హక్కులను సాధించుకుంటామన్నారు.